జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 10-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 270 పేజీలు: 4 వెల: రూ.7

వార్త

* ఆదిత్యాలయంలో నీటి సమస్యను పరిష్కరించిన ఈవో * క్యూలైన్లలోనూ నీరు పంపిణీ * డైలీవేజ్ సిబ్బంది అక్రమాలకు పాల్పడకుండా నిఘా * హర్షం వ్యక్తం చేసిన భక్తులు * సూర్యనారాయణస్వామిని దర్శించుకున్న కలెక్టర్ * నేడు, రేపు ఆదిత్యుని తాకనున్న సూర్య కిరణాలు

# కదిలించింది!




**శ్రీకాకుళం క్రైం, మార్చి 9 (వార్త):** 'జాతీయ వార్త'లో ఇటీవల ప్రచురితమైన కథనాలకు అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం అధికారులు స్పందించారు. ఆదిత్యాలయంలో నీటి సమస్యకు పరిష్కారం చూపారు. ఎండలు మండుతున్నందున భక్తులకు క్యూలైన్లలో నీటిని అందించి దాహార్తిని తీరుస్తున్నారు. అలాగే ఆలయంలో ఉన్న ఫ్రిజ్ పనిచేసేలా తక్షణం చర్యలు చేపట్టారు. తాత్కాలిక వంటశాల పక్కనే ఉన్న మరుగుదొడ్లను మూయించివేశారు. కొందరు డైలీవేజ్ సిబ్బంది అక్రమాలకు పాల్పడకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎర్రంశెట్టి భద్రాజీ నిఘా ఉంచారు. సూర్యనారాయణస్వామి ఆలయంలో సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన 'జాతీయవార్త'కు భక్తులు అభినందనలు తెలిపారు. కాగా, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్టు ఆలయ ఈవో 'జాతీయ వార్త' ప్రతినిధి వద్ద స్పష్టం చేశారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ ఆదివారం ఒక్కరోజే సూర్యనారాయణస్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. టిక్కెట్లు రూపేనా రూ.5,97,800, పూజలు, విరాళాల రూపంలో రూ.91,525, ప్రసాదాల రూపంలో రూ.1,65,635 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. సోమ, మంగళవారాల్లో సూర్యనారాయణస్వామి మూలవిరాట్‌కు సూర్యకిరణాలు తాకనున్నాయని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.















## ఆదిత్యుని దర్శించుకున్న కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్

ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను అందజేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీకి ఉచిత ఆన్లైన్ శిక్షణ

**శ్రీకాకుళం, మార్చి 9 (వార్త):** మెగా డిఎస్సీ పరీక్షకు అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ బిసి స్టడీ సర్కిల్ ఉచిత ఆన్లైన్ శిక్షణ ఇవ్వనుంది. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకులు విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ శిక్షణను ప్రారంభించనున్నట్లు బిసి స్టడీ సర్కిల్ శ్రీకాకుళం సంచాలకులు ఇ.అనురాధ తెలిపారు. టెట్లో అర్హత సాధించిన శ్రీకాకుళం జిల్లాలోని బిసి, ఈబీసీ కేటగిరికి చెందిన అభ్యర్థులు ఈ ఉచిత ఆన్లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల ఎంపిక టెట్లో సాధించిన మార్కుల ఆధారంగా జరుగుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు తమ 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (2 లక్షల లోపు), టెట్ మార్కుల జాబితా, రెండు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో టిడిపి భవనం వెనుక ఉన్న ఎపి బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఈనెల 10వ తేదీ నుండి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం 7382975679, 9295653489 నంబర్లను సంప్రదించవచ్చని అనురాధ తెలిపారు.

# పోలీస్ శాఖలో ప్రమోషన్ల లొల్లి




* పదోన్నతుల కోసం సివిల్ కానిస్టేబుళ్లు ఎదురుచూపు
* సివిల్‌లోకి వస్తున్న ఏఆర్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లు
* ఈ కారణంగానే పదోన్నతులు రావడం లేదన్న సీనియర్లు

**శ్రీకాకుళం క్రైం, మార్చి 9 (వార్త):** పోలీస్ కానిస్టేబుళ్లు కొందరు తమ సర్వీసు మొత్తం పూర్తి చేసుకుంటున్నా పదోన్నతులకు నోచుకోలేకపోతున్నారు. కానిస్టేబుళ్లుగానే రిటైర్ అవుతున్నారు. ప్రమోషన్ విషయంలో తమకు అన్యాయం జరుగుతోందని వారు ఆవేదన చెందుతున్నారు. ఏఆర్, ఏపీఎస్పీలో 12 ఏళ్ల సర్వీసు చేసుకున్న వారికి ఆ శాఖలో హెడ్‌కానిస్టేబుల్ ప్రమోషన్ వచ్చినా వారు వద్దనుకుంటూ సివిల్‌లోకి వస్తున్నారు. ఆ తర్వాత సివిల్‌లోకి వచ్చి ఇక్కడ కానిస్టేబుళ్లతో పదోన్నతుల కోసం పోటీ పడుతున్నారు. దీంతో సివిల్ కానిస్టేబుళ్లలో కొందరికి పదోన్నతుల రాక ఇబ్బందులు పడుతున్నారు. ఇది శ్రీకాకుళం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య ఉందని కొందరు సీనియర్ సివిల్ కానిస్టేబుళ్లు చెబుతున్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు చెందిన సుమారు 30 మంది వరకూ సివిల్ కానిస్టేబుళ్లు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. వారు ట్రైనింగ్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే ఏపీఎస్పీలో పనిచేసి సివిల్‌లోకి వచ్చిన కొందరు కానిస్టేబుళ్లు తాము పదోన్నతులకు అర్హులమని చెబుతూ కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో ట్రైనింగ్‌కు వెళ్లిన సివిల్ కానిస్టేబుళ్లు వెనక్కువచ్చేశారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు సీనియర్ పోలీస్ కానిస్టేబుళ్లు కోరుతున్నారు.

# ఆగని.. దాసుడి ఆగడాలు

* మూఢనమ్మకాల ముసుగులో నిలువు దోపిడి * మహిళల వద్ద బూతులతో పతి పూజలు * క్షుద్ర పూజలతో పైసలు కాజేస్తున్న దాసుడు * తక్కువ కాలంలో కోట్లకు పడగలెత్తిన వైనం * ఫిర్యాదు లేదని పట్టించుకోని పోలీసులు

**సంతబొమ్మాళి, మార్చి 9 (వార్త):** పొలాల్లో పశువుల కాపరిగా ఉన్న ఓ వ్యక్తి కొద్ది సంవత్సరాల క్రితం ఒక్కసారిగా దాసుడు అవతారం ఎత్తాడు. పెద్ద జటా వేసుకుని, బొట్టు పెట్టుకుని మొహమంతా పసుపు రాసుకొని నేను దేవుడి మనిషినని, నాపై అమ్మవారు వస్తుందని, నేను అమ్మవారి తల్లి స్వరూపమని అవతారమెత్తాడు.. ఓ దాసుడు. అక్కడితో ఆగకుండా అమ్మవారికి నగలు అంటే ప్రీతి అని తమ దగ్గర ఉన్న నగలు డబ్బు తనకు ఇస్తే మీ కష్టాలు తీరిపోతాయని నమ్మించి మోసగిస్తున్నాడు. ఇతర ప్రాంతాల వారు, మూఢనమ్మకస్తులను టార్గెట్‌గా చేసుకొని అతి తక్కువ కాలంలోనే కోట్లాది రూపాయలకి పడగలెత్తిన రెయ్యమ్మ దాసుడు అలియాస్ పరపటి రాము. ఈ దాసుడిపై 'జాతీయ వార్త'లో ప్రత్యేక కథనం.

సంతబొమ్మాళి మండలంలో హనుమంతు నాయుడుపేట పంచాయతీ పోతునాయుడుపేటలో రెయ్యమ్మ దాసుడు అలియాస్ పరపటి రాము ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. భక్తుల బలహీనతను ఆసరాగా చేసుకుని కోట్లాది రూపాయలు దోచుకుంటున్నాడు. ఇతర ప్రాంతాలవారే టార్గెట్‌గా ఈ దోపిడీని కొనసాగిస్తున్నాడు అయితే బాధితులకు తను అమ్మవారి స్వరూపమని నమ్మిస్తూ బంగారు నగలు, నగదు దోచేస్తున్నాడు. ఇలా ఇప్పటివరకు సుమారు 70 కేజీల




బంగారాన్ని సంపాదించినట్లు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. భక్తులు కోరిన ఇంటి వద్ద క్షుద్ర పూజలు చేసి లక్షల్లో డిమాండ్ చేసేవాడని గతంలో ఆరోపణలు ఉన్నాయి. గత కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే కోట్లాది రూపాయల డబ్బును, ఆస్తులను ఇలానే సంపాదించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా దాసుడు సొమ్ముతో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చక్కగా వ్యాపారం చేసుకుంటున్నారు. అతడిపై ఈగవాలకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రతివారంలో సోమ, గురు, శనివారం మూడు రోజులు ఆ గ్రామంలో కొత్తకొత్త వ్యక్తులతో, వాహనాలతో కనిపిస్తున్నా నిఘా పెట్టాల్సిన అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. సైన్స్ అభివృద్ధి చెందుతున్న తరుణంలో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాల్సిన పోలీసులు మౌనంగా ఉండడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. మరో విషయం ఏమిటంటే దాసుడు అడిగిన సొమ్ము ఇవ్వకపోతే అతని అనుచరులు దాడులకు కూడా పాల్పడుతున్నారు. ఇటీవల రోణంకి ధర్మారావు అనే వ్యక్తిపై దాసుడు, అనుచరులు దాడి చేశారు. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడంలో కొందరు పోలీసులు హడావిడి చేశారు. అయితే దాసుడి అనుచరులు పెద్దమొత్తంలో చేతులు తడపడం వల్ల సైలెంట్ అయ్యారని వారు బహిరంగంగానే చెబుతున్నారు. దాసుడి అనుచరులు మన జిల్లాలోనే కాకుండా ఒడిశా ప్రాంతాల్లో సంచరిస్తూ దాసుడి లీలలపై ప్రచారం కూడా చేస్తున్నారు. ప్రజల నమ్మకాలతో ఆడుకుంటున్న దాసుడితో పాటు అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని అతని బారిన పడి మోసపోయిన వారు కోరుతున్నారు.



## తెప్పలకు పురస్కారం

**పలాస, మార్చి9 (వార్త):** చత్తీశ్ గడ్ రాష్ట్రంలోని రాయపూర్ – గుడియారి మారుతీ మంగళ భవన్‌లో 8, 9 తేదీలలో జరిగిన చత్తీశ్ గడ్ తెలుగు ద్వితీయ మహాసభలకు పలాసకు చెందిన రచయిత, నటులు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు, లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొని 'స్వర్గం కన్న నా భారత్ మిన్న' అంటూ కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా చత్తీశ్ గడ్ తెలుగు మహా సంఘం సంరక్షకుడు జి.స్వామి, ఉపాధ్యక్షులు బర్రి జోగారావు, ఖర్గపూర్ తెలుగు సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్ర రెడ్డి, ప్రముఖ కవి సిరికి స్వామి నాయుడు ఈ పురస్కారాన్ని తెప్పలకు అందజేశారు. అలాగే పలాస ప్రాంతానికి చెందిన కళాకారుల బృందం పలు జానపద పాటలతో సభను ఉర్రూతలూగించారు. నోము నోమన్నాల తుమ్మెదలా, మేము కళాకారులం, మందులోడా, వాకిట పూసిన వాడంబరాలు, వెళ్లిపోతావ్ రా మనిషి, చిన్నక్కో ఉద్దానం చూడు పలు పాటలు తెలుగు ద్వితీయ మహాసభల్లో పాల్గొన్న తెలుగుప్రజలను ఉర్రూతలూగించింది. గిడుగు రామ్మూర్తి కళాపీఠం కన్వీనర్ సిస్టు మనోజ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్, జన జాగృతి వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి, ప్రముఖ రచయిత వంకల రాజారావు, ప్రముఖ రచయిత శివజ్యోతి అరుణోదయ సేవా సంఘ కార్యదర్శి సోర్ర రామారావు, కోరస్ వాయిద్య సహకారాన్ని అందించారు.

## లింబుగాంలో అపారిశుద్ధ్యం




**మందస, మార్చి 9(వార్త):** మందస మండలంలోని అంబుగాం పంచాయతీ పరిధిలో లింబుగాం గ్రామంలో తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామ అభివృద్ధి కోసం కాలువలు నిర్మించారు. నిర్మించినటువంటి కాలువ చెత్తతో నిండిపోయింది. దీంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తోందని తెలుగు దేశం నాయకులు తలగాన రాజశేఖర్, మండల లచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని మురికి నీరు కలుషితం చేస్తోందని, ఈ విషయమై అంబుగాం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండల లచ్చయ్య పంచాయతి సెక్రటరీ, ఎంపీడీఓలకు విన్నవించుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లేద న్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే స్పందించి కాలువలను శుభ్రం చేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని వారు కోరారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదలకు
# 12న పోరుబాట

**వంగర, మార్చి 9 (వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పేద విద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్‌మెంట్ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలంమైందని ఎంపీపీ సురేష్ ముఖర్జీ ధ్వజమెత్తారు. దీనిపై ఈ నెల 12 విజయనగరం జిల్లా కేంద్రంలో వైసీపీ పోరు బాట కార్యక్రమం నిర్వహిస్తోందని, వైసీపీ శ్రేణులు అభిమానులు తరలి రావాలని కోరారు. నిరుపేద విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాల కింద విద్యార్థులకు మేలు జరిగిందన్నారు. ఉన్నత విద్యకు వైఎస్ జగన్ 26 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ పథకాలు అటకెక్కాయని విమర్శలు గుప్పించారు. 3900 కోట్లు బకాయిలు ఉన్నా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందన్నారు. పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అయినప్పటికీ ఈ ప్రభుత్వం కబుర్లతో కాలక్షేపంచేస్తుందని మండిపడ్డారు. ఈనెల 12వ ఉదయం 10గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం వద్దనున్న డా.వైయస్సార్ విగ్రహం వద్ద వైయస్సార్ కాంగ్రెస పార్టీ ఆవిర్భావ దినోత్సవం అనంతరం మున్సిపల్ కంటోన్మెంట్ కార్యాలయం వద్ద నుండి విద్యార్థుల పోరుబాట నిరసన ర్యాలీ చేపట్టి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం నకు జిల్లా అంతటా వైసీపీ పార్టీ నేతలు అందరూ కలిసి రావాలని కోరారు.




జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక




* సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ * కృష్ణాపార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు అందజేత * మహిళా హెూంగార్డుల ఇన్సూరెన్స్‌కు రూ.రెండు లక్షల విరాళం * 100 మంది మహిళలకు రూ.ఎనిమిది లక్షలు విలువ చేసే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్లు, థైరాయిడ్, రక్తపరీక్షలు * అట్టహాసంగా డాక్టర్ దానేటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు

# నిస్వార్థ సేవకుడు.. డాక్టర్ శ్రీధర్




**శ్రీకాకుళం, మార్చి 9 (వార్త):** సమాజ హితం కోసం పాటు పడే నిస్వార్థ సేవకుడు డాక్టర్ దానేటి శ్రీధర్ అని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ అన్నారు. జనసేన నాయకులు, ప్రముఖ గైనికాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ పుట్టినరోజును శ్రీకాకుళం నగరంలోని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆయన నివాసం వద్దకు జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని డాక్టర్ శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ భారీగా బాణాసంచా కాలుస్తూ సందడి చేశారు. అనంతరం జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెంట రాగా వందలాది మందితో బైకు ర్యాలీని ప్రారంభించారు. హడ్కోకాలనీ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ అంబేద్కర్ జంక్షన్‌కు చేరుకోగా అక్కడ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ డే అండ్‌నైట్ మీదుగా కొత్త వంతెనపై నుంచి మెడికవర్ ఆసుపత్రి వద్దకు చేరుకుంది. అక్కడ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అశేష అభిమానులు వెంట రాగా డాక్టర్ దానేటి శ్రీధర్ మెడికవర్ వద్ద సభాస్థలికి చేరుకున్నారు. అక్కడకు భారీ ఎత్తున జనసేన నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు, వైద్యులు, రాజకీయ ప్రతినిధులు చేరుకొని డాక్టర్ దానేటి శ్రీధర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తూ, కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## కృష్ణాపార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు అందజేత

తన పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ దానేటి శ్రీధర్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఈ సారి మరో అడుగు ముందుకు వేసి నగరంలోని కృష్ణాపార్కు జంక్షన్ అభివృద్ధి, పార్కు నిర్మాణానికి, కృష్ణుని విగ్రహ ఏర్పాటుకు రూ.10 లక్షల చెక్కులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్‌కు అందజేశారు. అలాగే పోలీస్ శాఖలో పనిచేస్తున్న మహిళా హెూంగార్డుల ఆరోగ్య భద్రతకు ఇన్సూరెన్స్ పేరిట రూ. రెండు లక్షల చెక్కు అందజేశారు. వీటితో పాటు 100 మంది కళాశాల విద్యార్థినులకు సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షించే దిశగా ఉచితంగా రూ. ఎనిమిది లక్షలు విలువ చేసే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్లను వేయించారు. కొందరు విద్యార్థినులు రక్తహీనతతో కన్పించడంతో మరో 100 మందికి థైరాయిడ్, రక్తపరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అలాగే డాక్టర్ దానేటి శ్రీధర్ పుట్టినరోజును పురస్కరించుకుని మణికంఠ బ్లడ్‌బ్యాంకు వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది పాల్గొని రక్తదానం చేశారు.

## పదవుల కన్నా ప్రజాసేవతోనే సంతృప్తి: దానేటి

రాజకీయాల్లో పదవుల కన్నా పేద ప్రజలకు అందించే సేవలోనే తనకు నిజమైన సంతృప్తి కలుగుతోందని జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితుడినై జనసేన పార్టీలో చేరానని చెప్పారు. పవన్ కళ్యాణ్ ఇచ్చిన స్ఫూర్తి, పోరాట పటిమతో మరింతగా ప్రజాసేవలో, నగర అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానన్నారు. రెండు దశాబ్దాలుగా వైద్యవృత్తిలో కొనసాగుతూ ఎన్నో గొప్ప విజయాలు సాధించేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తన వెన్నంటే ఉంటూ తన అభివృద్ధికి సహకరిస్తున్న వారిని ఎప్పటికీ తాను మరిచిపోనని ఈ సందర్భంగా వివరించారు. తన అభిమానులు అందించే అభిమానం, ప్రేమ, ప్రోత్సాహంతో నా వయసు మరింత ఉరుకులు వేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగుతోందని ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ దానేటి శ్రీధర్ పుట్టిన రోజు వేడుకల్లో జనసేన నాయకులు గేదెల చైతన్య, బలగ ప్రవీణ్, సయ్యద్ విశ్వక్‌షేన్,



సంతోష్ పండా, జామి భీమశంకర్, అంధవరపు సంతోష్, ప్రసాద్, ఊన్న సర్వేశ్వరరావు, కొర్ను ప్రతాప్, దుప్పల వెంకటరావు, డాక్టర్లు బుడుమూరు అన్నాజీరావు, అన్నెపు శివప్రసాద్, మూల వెంకటరావు, హనుమంతు అనీల్‌కుమార్, సువ్వారి రవి, దుంపల హరిప్రసాద్, తమ్మినేని దివాకర్, మెట్ట సందీప్, కె విద్యాసాగర్, గురుగుబిల్లి సందీప్, పి. అనురుధ్, రంగనాథంతో పాటు వీరమహిళ మోహనలక్ష్మీ, బొట్టా శంకర్, ఉదయ్‌లతో జనసేన నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలు, వైద్యులు, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం

* టీడీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి
* పార్టీ శ్రేణులతో సమన్వయ సమావేశం

**పలాస, మార్చి9(వార్త):** గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని పలాస నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త వెంకన్న చౌదరి అన్నారు. ఆదివారం పలాస నియోజకవర్గం టిడిపి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్దే ధ్యేయంగా పనిచేద్దామని, కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని, గ్రామ సమస్యలు కార్యకర్తల సమస్యగా గుర్తించి పని చేయాలని కోరారు. సంవత్సర కాలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రతి కార్యకర్త తన భుజాలపై వేసుకొని అలుపెరగని పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీల్లో అభివృద్దే ధ్యేయంగా పని చేస్తున్నామని, నిరాశ లేకుండా పనిచేయాలని కార్యకర్తలను కోరారు. నియోజకవర్గ లో ప్రతి గ్రామంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని, కార్యకర్తలకు గుర్తింపు వస్తుందని, గతంలో జరగని అభివృద్ధి ఏమిటో చేసి చూపించాలని అన్నారు. పలాస ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత హయాంలో పలాస నియోజకవర్గాన్ని నెంబర్ వన్ నియోజకవర్గం తీర్చిదిద్దాలని కోరారు. నియోజకవర్గ. ప్రధాన సమస్య లు పై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంథాలయం మాజీ చైర్మన్ పీరుకట్ల విఠల్, మండల తెలుగు యువత అధ్యక్షులు కుత్తమ లక్ష్మణ్, టిడిపి ముఖ్య నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, లోడగల కామేష్, దువ్వాడ సంతోష్, గాలి కృష్ణారావు, సురేష్ తెలుగు తమ్ముళ్లు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల

**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):**జిల్లాలోని సెకండరీ హెల్త్ ఆసుపత్రులలో కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు ఈనెల 10 నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. థియేటర్ అసిస్టెంట్, ఆడియోమెట్రీషియన్, ఎలక్ట్రీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్, ప్రింటర్ వంటి వివిధ పోస్టులకు ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా వెబ్‌సైట్ https://srikakulam.ap.gov.inను సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం డిసిహెచ్ఎస్ ఆఫీస్ నోటీసు బోర్డును కూడా సందర్శించవచ్చు. ఈ ఉద్యోగాలు ఒక సంవత్సరం కాలపరిమితికి మాత్రమే. రిజర్వేషన్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తిస్తాయి. మరింత సమాచారం కోసం, అభ్యర్థులు శ్రీకాకుళం జిల్లా వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా గ్రీష్మ

* ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎస్సీ కోటాలో కేటాయింపు
* అధిష్టానం ప్రకటించడంతో కూటమి శ్రేణుల్లో ఆనందం
* మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మ



**వంగర, మార్చి 9 (వార్త):** ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన కావలి గ్రీష్మను టీడీపీ ప్రకటించింది. మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి కుమార్తె ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ గా వ్యవహరిస్తున్న గీష్మ ను ఎంఎల్ ఏ కోటా కింద ఆమెను అభ్యర్థిగా టీడీపీ అధిష్టానం ప్రకటించింది. గత ఏడాది నవంబరు 20 తేదిన ఏపీ ఉమెన్ కోపరేటివ్ ఫైనాన్సియల్ కార్పోరేషన్ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. పార్టీకి స్పోక్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. కార్పోరేషన్ చైర్ పర్సన్ గా వ్యవహరించడంతో అసలు ఎమ్మెల్సీ ంసులో ఆమె ఉంటుందని ఎవరూ అనుకోలేదు. మహిళలకు ప్రాధాన్యతను ఇచ్చే క్రమంలో ఎస్సీ సామాజికవర్గం నుంచి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన మాజీ స్పీకర్ ప్రతిభా భారతి కుమార్తె కావలి గ్రీష్మకు పార్టీ అవకాశం కల్పించింది. 2014 ఎన్నికల్లో రాజాం నుంచి ఓటమి పాలైన ప్రతిభా భారతికి చంద్రబాబునాయుడు ఎంఎల్సీగా అవకాశం కల్పించారు. అప్పట్లో లోనూ గ్రీష్మ తల్లి ఎంఎల్ఏ కోటాలో శాసనమండలిలో అడుగు పెట్టారు. ఆమె వారసురాలుగా రాజకీయాల్లో ఉన్న కావలి గ్రీష్మను హైకమాండ్ ఎంఎల్సీ అభ్యర్థిగా నిర్ణయించారు. ఈ నెల 20న ఎన్నికలున్న విషయం విధితమే. టీడీపీలో ప్రత్యేక స్థానం సంపాదించిన ప్రతిభా భారతి ఆమె కుమార్తె గ్రీష్మను యువ నాయకత్వంలో అధిష్టానం చోటు కల్పించడంతో ఆమె తల్లి కి తగ్గ తనయురాలుగా దూసుకుపోతారంటు పార్టీ వర్గీయులు, ఆమె అభిమానులు స్పష్టం చేస్తున్నారు.

### ఎమ్మెల్సీ అభ్యర్థిగా గీష్మ ఎంపిక పట్ల హర్షం

ఎమ్మెల్సీ అభ్యర్థిగా కావలి గ్రీష్మను ఎంపిక చేయడం పట్ల కూటమి శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పైల వెంకట రమణ, తెలుగు దేశం పార్టీ వంగర నాయకులు గంటా ఖగేంద్ర నాయుడు, వైకుంఠ రావు, అప్పల నాయుడు, జి.కె.నాయుడు తదితరులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రీష్మా పార్టీకి ఎనలేని సేవ చేసినందుకే ఆమెకు టీడీపీ అధిష్టానం తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు.

# భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి

* పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు
* పార్టీలో చేరిన 15 కుటుంబాలు



**మందస, మార్చి 8(వార్త):** భారతీయ జనతా పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తున్నామని బీజేపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్ చార్జ్ రౌతు చిరంజీవిరావు చెప్పారు. మందస పట్టణంలోని వాసుదేవ ఆలయంను సందర్శించి, స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పార్టీ బలోపేతం చేయడానికి పార్టీ కేడరుతో చర్చలు జరిపారు. రాబోయే రోజులు బీజేపీవేనని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు తెలుకుల సురేష్ ఆధ్వర్యంలో సుమారు 15కుటుంబాలు బీజేపీలో చేరాయి. వీరికి సిరిపురం తేజేశ్వరరావు, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్ చార్జ్ రౌతు చిరంజీవిరావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆహ్వానించి, పార్టీ కండువాలు వేశారు. మందస మండల బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా సాయిని నియమించారు. సవర కృష్ణ మోహన్ బాబు, రమేష్, కైలాస్, నరసింహులు, రామారావు, పద్మ, చిన్న, మల్లేష్, సుభాష్, షణ్ముఖరావు, సింహాచలం తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ బమ్మిడి అప్పన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు హడ్డి, వెంకట్రావు, జాదవ తదితరులు పాల్గొన్నారు. బీజేపీలో చేరడానికి చాలామంది సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ మందస మండల అధ్యక్షుడు తెలుకుల సురేష్ చెప్పారు.

# బూత్ స్థాయిలో బలోపేతం చేయాలి



**ఇచ్ఛాపురం, మార్చి 9 (వార్త):** స్థానిక వీకేపీ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా కార్యదర్శి వల్లంపటి కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు బిర్లంగి ఉమామహేశ్వరావు, విజయానంద్ రెడ్డి, అట్టాడ రవి బాబ్జి, పూడి తిరుపతి రావు, పైడి వేణు గోపాల్, సలాన రాఘవ రావు, గాంధీ, పాలవలస వైకుంఠరావు పాల్గొని ప్రసంగించారు. చిన్నారి ధర్మారావుతో పాటు మరికొందరు బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో నాయకులు నిర్మల రెడ్డి, మంగి లక్ష్మి, సోంపేట, ఇచ్ఛాపురం రూరల్, అర్బన్, కవిటి, కంచిలి మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు.

# విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

* సూర్యోదయ స్కూల్ డైరక్టర్ నాగేశ్వరరావు




**మందస, మార్చి 9(వార్త):** విద్యతోనే మనిషి సర్వతోముఖాభివృద్ధి చెందుతాడని, ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని సూర్యోదయ స్కూల్ డైరక్టర్ మోణంగి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పిల్లి లోకేశ్వరరావు అన్నారు. మందస పట్టణంలో సూర్యోదయ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ విద్య ఎంతో అవసరమన్నారు. వెనుకబడిన మందస వంటి ప్రాంతంలో కూడా తమ సంస్థ విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలకు ప్రోత్సాహం కరువవుతోందని తెలిపారు. తాము వెనుకడుగు వేయక సూర్యోదయ స్కూల్ను అభివృద్ధి చేస్తూ, నాణ్యతతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవుతూ.. నూతన ఒరవడులతో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలోనే నెంబరు-1 పాఠశాలగా గుర్తింపు పొందగలిగామని, విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీఐపీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పడాల ధర్మారావు, కాళీచరణ్ పట్నాయిక్, ధనరాజు, మంజు, తులసీదాసు, ధర్మారావు, నితీష్, దామోధర్, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ముగిసిన టెక్ ఫెస్ట్

**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):**ఎచ్చెర్ల రాజీవ్ గాంధీ విజ్ఞానిక విశ్వ విద్యాలయంలో జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఆదివారం ముగిసింది. డైరక్టర్ ప్రొఫెసర్ ఆచార్య కొక్కిరాల వెంకట ధన బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామ కృష్ణ, డీన్ మోహన కృష్ణ చౌదరి స్టాల్స్ ని సందర్శించారు. ఈ టెక్ని వెర్స్‌లో డిపార్టుమెంటల్ వర్క్ షాప్స్, టెక్నికల్ క్విజ్, రోబోటిక్స్, టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్ ఇలా 50 పైబడి ఈవెంట్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## హిందువులపై దాడిని ఖండిస్తున్నాం



**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):** అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈనెల 4న హిందూవులపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కన్వీనర్ పి.సురేష్‌సింగ్ బాబు తెలిపారు. హిందువులపై ముస్లింలు దాడి చేస్తున్న సందర్భంలో పోలీసులు అదుపు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఏకంగా రాళ్లు విసిరిన ముస్లింలను వదిలేసి హిందువులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమన్నారు. దాడి చేసిన ముస్లింలపై కేసులు పెట్టాలని, హిందువులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## రట్టిలో పోలీసుల డ్రోన్‌తో నిఘా

**మందస, మార్చి 9(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రట్టి యాత్రకు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ ఏటా రట్టిలో వల్లభనారాయణస్వామి యాత్ర ఘనంగా జరుగుతుంది. భక్తులు పెద్ద ఎత్తున యాత్రకు వచ్చి, స్వామిని దర్శించుకుంటారు. రట్టిలో బీచ్లో భక్తులు సముద్రస్నానాలు కూడా చేస్తారు. ఈ తరుణంలో యాత్ర ప్రాధాన్యత దృష్ట్యా మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో వల్లభ నారాయణస్వామి యాత్ర విజయవంతం జరగడానికి సర్వే చేశారు. ప్రత్యేకంగా రట్టి పరిసర ప్రాంతాలపై డ్రోన్ నిఘా పెట్టారు. ఎటువంటి అసాకర్యం, అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ఉండేందుకు డ్రోన్ విజువల్స్‌పై దృష్టి సారించారు. 35నుంచి 40 మందితో భద్రత చర్యలు చేపడుతున్నామని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్టు ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు.

## మహిళా సాధికారతతోనే సమసమాజ నిర్మాణం

**శ్రీకాకుళం, మార్చి 9(వార్త):** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వివిధ రంగాల్లో సేవలు అందించే 25 మందికి పైగా మహిళామణులను స్టార్ వాకర్స్ క్లబ్ ఘనంగా సన్మానించింది. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, ఎస్.జోగినాయుడు, పిజి గుప్త, రవిశంకర్, జి. లక్ష్మి, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సన్మానం పొందినవారిలో లయన్స్ క్లబ్ నుంచి వి.జ్యోతిర్మయి, పి.మణిశర్మ, రెడ్ క్రాస్ నుంచి అంపోలు కళ్యాణి, భాగ్యభారతి, ఎలియన్స్ నుంచి పద్మజ, పి. అనూరాధ, రోటరీ క్లబ్ నుంచి కె. సుజాత, పి. అనూరాధ, లయన్స్ క్లబ్ హర్షవల్లి నుంచి సరళ, సామాజిక సేవకురాలు తమ్మినేని ఉషా, సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.పద్మ, ఎ.జ్యోతిర్మయి, భారతి ఉన్నారు. అలాగే స్టార్, వనితా వాకర్స్ క్లబ్ ల సభ్యులు జి. లక్షి,వి.వాసంతి, అడపా శాంతి, పి. వాసంతి, బి. విజయలక్ష్మి, ఎన్. విజయలక్ష్మి, ఎస్. సరస్వతి, మెట్ట కళావతమ్మ, పి. లక్ష్మి. పి. అనీల,వి. రామ్ బాయిలను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ గుడ్ల సత్యనారాయణ, వాకర్స్ ప్రతినిధులు గోలి ఉమ, డాక్టర్ గజల్ వాసుదేవాచారి, గొర్లె వాసు మాస్టార్ , బసవరాజు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు, మోహన్, మల్లి బాబు, గోపాలరావు, తవుడు, పి. రామారావు,మెట్ట ధనంజయభట్లు, ఎన్. కృష్ణమూర్తి, సింహాద్రి వేణుగోపాల్, స్టార్, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌పై అవగాహన

పలాస, మార్చి 9 (వార్త): పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ద్విచక్ర, బహు చక్ర వాహన చోదకులకు ట్రాఫిక్ అవేర్నెస్ అండ్ సేఫ్టీ నామ్స్ గూర్చి రామకృష్ణాపురంలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్ విద్యార్థులు వివరించారు. ఆదివారం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగాశ్రీ సత్యసాయి విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్ల రామేశం మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలన్నారు. లేకుంటే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ప్రైమరీ ఇంచార్జ్ దాలేటి, ఉపాధ్యాయులు, అసిస్టెంట్ మేనేజర్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546